## క్లుప్తంగా

### 9న సర్వసభ్య సమావేశం

**ఎల్కతుర్తి:** ఈనెల 9వ తేదీన భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా స్వర్ణలత



**ఎల్కతుర్తి:** కాంగ్రెస్ పార్టీ భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ మహిళా అధ్యక్షురాలుగా కవ్వంపల్లి స్వర్ణలతను నియమిస్తున్నట్లు ఆపార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్షురాలకు స్వర్ణలత కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్ణయం మేరకు కృషి చేస్తానని తెలిపారు.

### నేడు అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**హన్మకొండ కల్చరల్ :** వరంగల్ భద్రకాళిరోడ్‌లోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప భక్తసేవాశ్రమంలో బుధవారం అయ్యప్ప జన్మనక్షత్ర అష్టాభిషేకం, మహాపడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు గణపతిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పూజా మహోత్సవంలో ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, శ్రీశంకర గురుకుల వేదపాఠశాల అధ్యాపకులు, వేద పండితులు నారాయణ ఘనాపాటి, వేంకటేశ్వరశర్మలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సేవాశ్రమం నిర్వాహకులు టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి గోపూజ, మహాసంకల్పం, కలశస్థాపన, సహస్రమోదక మహాగణపతి హవనం, అయ్యప్పహవనం, మహాపూర్ణాహుతి, ప్రత్యేకపూజలు, అయ్యప్ప స్వామివారికి 18 రకాల అభిషేకాలు తదితర పూజాకార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం



**విద్యారణ్యపురి:** హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రాథమిక పాఠశాలలో బండెల రమేశ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 28న అనారోగ్యంతో మృతి చెందాడు. రమేశ్ పీఆర్‌టీయూ టీఎస్ కమలాపూర్ మండలశాఖలో అసోసియేట్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. పీఆర్‌టీయూ టీఎస్ నూతనంగా ప్రవేశపెట్టిన క్రియాశీలక సభ్యుడిగా, సంక్షేమ సంస్థసభ్యుడి రమేష్ కొనసాగుతున్నాడు. మంగళవారం ఈ సంక్షేమ నిధి నుంచి పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరిలు రూ.2 లక్షల చెక్కును హనుమకొండలో రమేష్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ అసోసియేట్ ఉపాధ్యక్షుడు ఆర్.భాను ప్రసాద్‌రెడ్డి, కమలాపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, శీలం ప్రకాశ్‌బాబు, బాధ్యులు దయాకర్‌రెడ్డి, సదాశివరెడ్డి, కాజీపేట మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

### రుద్రాభిషేకాలు



**మడికొండ:** కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. కాజీపేట వాస్తవ్యులు శర్విరాల సోమేశ్వర్–స్వరూపరాణి దంపతులు సుమారు రూ.28 వేల విలువగల వెండి శతగోపం, ప్లేటు సమర్పించారు. రామలయంలో సీతారామచంద్రస్వామి వారికి ప్ర త్యేక అర్చనలు నిర్వహించారు. సాయంకాలం సూ ర్యాస్తమయం అనంతరం స్వామివార్లకు ఆకాశదీపోత్సవం నిర్వహించారు. అనంతరం పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో కార్యని ర్వహణాధికారి కే. శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, స త్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈనెల 8వ తేదీన సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి శేషుభారతి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయనకోరారు.

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- అయోమయంలో అన్నదాతలు
- శాయంపేటలో వీడని ముసురు



చెన్నారావుపేట : ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతు



చెన్నారావుపేట : తడిసిన పత్తిపంట



శాయంపేట : కురుస్తున్న వర్షం



ఖానాపురం : వర్షంలో తడవకుండా ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

**శాయంపేట :** మండలంలో మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి ముసురు కురుస్తోంది. ప్రజలు అత్యవసరమైతేనే వీధుల్లోకి వచ్చారు. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు తెరచుకోలేదు. వరి పంట చేతికందే తరుణంలో తుపాన్ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మాందారిపేటలో నిల్వ చేసిన ధాన్యంపై రైతులు టార్పాలిన్లు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్త పడుతున్నారు. చేళ్లలోని పత్తి నల్లబడి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికచ్చే ముందు తుపాను రావడం నష్టాల్లో నెట్టుతుందని వాపోతున్నారు.

**కమలాపూర్:** నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న మిచాంగ్ తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం చిరు జల్లులు కురిశాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై కురిసిన ముసురు వానకు తోడు చలి తీవ్రత పెరగడంతో అత్యావరమైతే తప్ప ఇళ్లల్లోంచి ఎవరూ బయటకు వెళ్లలేదు. పంట కోతలు పూర్తి కాకముందే మిచాంగ్ తుపాన్ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**దుగ్గొండి:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి వరి, మిరప, పత్తి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట కళ్లెదుటే నేలపాలవుతుండడంతో రైతన్నలు తీవ్ర వేదనకు గురౌతున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షం కురిస్తే వానాకాలం పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు 5100 ఎకరాల్లో వరి, 13 వేల ఎకరాల్లో పత్తి, 3800 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఇటీవలే వరి కోతలు మొదలయ్యాయి. ఇంకా 75 శాతం కోయాల్సి ఉంది. మిరప తోటలు మంచి కాపులో ఉండి కాయలు పండు దశలో ఉన్నాయి. వర్షం కారణంగా వరి, మిరప నేలవాలాయి. కొన్నిచోట్ల కోసిన వరి మొదళ్ల తడిచి దెబ్బతిన్నాయి. పండిన మిరప కాయలు తాలుగా మారే ప్రమాదం నెలకొంది. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టిన రైతులు తలలు పట్టుకుంటున్నారు.

**చెన్నారావుపేట:** మండలంలోని అన్ని గ్రామాల్లో రెండ్రోజులుగా వర్షం కురుస్తుండడంతో మిర్చి తోటలు పూత రాలడంతోపాటు పత్తి ఏరకపోవడంతో తడిచి దెబ్బతిన్నాయి. వరి పొలాల్లో పంటలు తడిసిపోతున్నాయి. చేతికందిన పంటలు వర్షం పాలవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఖానాపురం:** మండల వ్యాప్తంగా రైతులు వర్షాలు పత్తి, మిర్చి, వరి పంటలు నష్టపోయారు. రైతులు పాకాల ఆయకట్టు పరిధిలో వరి కోతలు ఇప్పటికే ప్రారంభించారు. వరి కోతలు పూర్తి చేసుకున్న రైతులు ఖాళీ స్థలాలు, సబ్‌మార్కెట్ యార్డులు, రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. కొందరు బస్తాల్లో నింపుకోగా మరికొందరు విక్రయించుకోవడానికి సిద్ధమయ్యారు. కాగా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. సబ్‌మార్కెట్‌లో, ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని తడవకుండా తాటిపత్రిలతో కాపాడుకుంటున్నారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

**ఆత్మకూరు:** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయం అందించి ప్రభుత్వం ఏర్పాటుకు ముఖ్యులైన ప్రజల నమ్మకాన్ని నిలబెడుతామని ఆపార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తామని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని పోగొట్టుకోమని, సంక్షేమం దిశగా పాలన సాగుతుందని అన్నారు. నియంత పాలనకు ముగింపు పలికిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. తూచా తప్పకుండా ప్రజా సాగుతుందన్నారు.

## బీజేపీకి ప్రజాదరణ పెరిగింది

**ఆత్మకూరు:** నియోజకవర్గంలో బీజేపీకి ప్రజా నుంచి ఆదరణ పెరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో ఓటర్లు అయోమయానికి గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పరాజయం పొందినప్పటికీ నైతికంగా విజయం తమదేనని అన్నారు.

## ఎన్నికల హామీలను నెరవేర్చాలి

**శాయంపేట :** అసెంబ్లీ ఎన్నికల్లో హామీలు ఇచ్చి విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ) భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి ఆశ్రఫ్ ఉస్మాన్ అన్నారు. మండలంలోని వసంతాపూర్‌లో మంగళవారం మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేరుస్తామని ప్రజలకు చేసిన వాగ్దానాలను మరిచిపోవద్దని సూచించారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తామని అన్నారు. ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## క్రమశిక్షణతో విద్యనందించడం అభినందనీయం

- ఇంటర్ విద్య డీఈఈఓ మాధవరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాధవరావు

**రామన్నపేట :** ఏవీవీ విద్యాసంస్థ ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీ పడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం అభినందనీయమని ఇంటర్ విద్య డీఈఈఓ కె.మాధవరావు పేర్కొన్నారు. ఏవీవీ వార్షికోత్సవ వేడకలను పురస్కరించుకుని విద్యాసంస్థలో మంగళవారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏవీవీ విద్యాసంస్థలో చదువుకోవడం అదృష్టమని పేర్కొన్నారు. విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉత్తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ చందా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నిత్యం శ్రమిస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్ కోసం అన్ని విధాలా సాయం చేయడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బరుపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**శాయంపేట :** మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రాజోజు రాజవీరు ఆనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా సామాజిక సేవకుడు అమ్మ అశోక్ అండగా నిలిచారు. గ్రామస్తులతో పాటు ఎన్నారైల నుంచి విరాళాలు సేకరించారు. రూ. 47వేల 5వందల జమ కాగా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

## లారీ ఓనర్లను ప్రభుత్వమే కాపాడాలి



విజయోత్సవ సంబురాల్లో పాల్గొన్న ఎండీ గోరెబాయ్, లారీ ఓనర్లు

**ఖిలా వరంగల్ :** ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్న లారీ ఓనర్లను నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమే కాపాడాలని రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ, ఓరుగల్లు లారీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ. గోరేభాయ్ కోరారు. తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం వరంగల్–నర్సంపేట రోడ్డులోని లారీల పార్కింగ్ ప్రాంగణంలో లారీ ఓనర్లు స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చి పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లారీ ఓనర్ల దీర్ఘకాలంగా ఎదుర్కొనే ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్లు చిట్టిమల్ల శ్రీనివాసరావు, వేముల శ్రీకాంత్, ఎండి యాకూబ్ షరీఫ్, సాంబారి సంపత్‌కుమార్, సమ్మయ్య, ఇస్మాయిల్, ఖాజాపాషా, మాషూక్, శ్రావణ్, పీటర్, శ్రీనివాస్, భిక్షపతి, ఇజాజ్, చోటేమియా, సాయికుమార్, బషీర్, అబిద్, అజ్జు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## రాజనర్సింహను కలిసిన జన్ను భాస్కర్

**వరంగల్:** కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ ఉప ముఖ్య మంత్రి దామోదర రాజానర్సింహను ఆయన జన్మదినం సందర్భంగా తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

**హసన్‌పర్తి:** రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండలంలోని ఎల్లాపురం శివారులో గల ఆర్బిట్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్రి భవన్‌లో జరిగిన జిలాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో పాఠశాలకు చెందిన ఎస్.సాత్విక్, ఎం.అభిరామ్, పి.అక్షర, జి.నిఖిల్,బి, రవి తేజ, ఇ.ఆత్రేయనిలు ఎంపికయ్యారు.

## సామాజిక సేవలో ఇంద్రసేన ట్రస్ట్



ఆడపిల్లకు ఫిక్స్‌డ్ బాండ్ అందజేస్తున్న ఇంద్రసేన ట్రస్ట్ చైర్మన్ ఉమేష్

**ఖిలా వరంగల్:** తండ్రి ఆశయ సాధనకు తనయుడు సామాజిక సేవలపై దృష్టి సారించాడు. తనకు ఉన్నంతలో పేదలకు ఆర్థిక సాయం చేయాలని సంకల్పించాడు. తండ్రి లేని పేదింటి ఆడపిల్లలకు రూ.10వేల ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టాడు. కార్మికనేత ప్రముఖ న్యాయవాది, దివంగత ఇంద్రసేన 60వ జయంతి సందర్భంగా మంగళవారం తూర్పుకోటలో ఇంద్రసేన మెమోరియల్ ట్రస్టు చైర్మన్ సంగరబోయిన ఉమేష్ ఆధ్వర్యంలో పేదింటి ఆడపిల్లల చదువుల కోసం ఆర్థికసాయం అందించారు. ఇటీవల మృతిచెందిన సిరబోయిన శివ కుమార్తెకు సంగరబోయిన ఉమేష్ రూ.10వేలు పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను ఆ శాఖ అధికారి వెంకన్న అందించి అందజేసి సేవాదాతృత్వాన్ని చాటుకున్నాడు. ఇంద్రసేన ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

## కాంగ్రెస్ నాయకుడికి ఘనసన్మానం

**గీసుకొండ:** మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. గీసుకొండ శివారులోని గట్టుకిందిపల్లి సమీపంలో బాలకిషోర్‌రెడ్డి సొంత ఖర్చులతో మంగళవారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు పలు గ్రామాల నుంచి శ్రేణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి విజయం సాధించేలా బాలకిషోర్‌రెడ్డి ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. అనంతరం బాలకిషోర్‌రెడ్డి మాట్లాడారు. తాను ప్రత్యక్ష రాజకీల్లోకి రావడం లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడిగా శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ అధికారంలోకి రావడం, పరకాల నుంచి రేవూరి గెలవడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీని వాస్, నాయకులు సాయిలి ప్రభాకర్, మాదాసి రాంబాబు, దొడు భరత్, కొమ్ము శ్రీకాంత్, జావిద్, ఎంపీటీసీ గోపాల్, నాగరాజు, మర్రెడ్డి పాల్గొన్నారు.

## సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సఖి సెంటర్ ప్రతినిధులు

**ధర్మసాగర్:** సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సఖి సెంటర్ కేస్‌వర్కర్లు హరిత, వినీల కోరారు. మండలంలోని జానకిపురంలో మంగళవారం సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడారు. సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను వివరించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ కొనసాగుతున్నట్లు తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సాయం అందించి వారికి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. భార్యభర్తలు విడిపోయేందుకు ప్రయత్నిస్తే మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్, వైద్య సాయం, తాత్కాలిక వసతి అందిస్తున్నట్లు తెలిపారు. మహిళకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని, సమస్యలు, హింసకు గురయ్యే మహిళలు, బాలికలు సఖి సెంటర్‌లో ఫిర్యాదు చేయాలని లేదా ఫోన్ నంబర్ 0870–2452112, టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, రమ, అంగన్‌వాడీ టీచర్లు, సఖి కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ భవన్‌గా నామకరణం హర్షణీయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీరన్న నాయక్, నాయకులు

**ఎల్కతుర్తి:** ప్రగతి భవన్‌ను అంబేడ్కర్ ప్రజాభవన్‌గా నామకరణం చేయడం హర్షించదగిన విషయమని తెలంగాణ గిరిజనుల మేధావుల ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న నాయక్ హర్షం వ్యక్తం చేశారు. భీమదేవరపల్లి మండలం ములుకనూర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అవలంబించిన నిరంకుశ విధానాలకు స్వస్తి పలికిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాబోయో పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవరసం ఉందన్నారు. అలాగే ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవీ ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్‌ముఖర్జీ, మహిళా మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, నాయకులు రాజు, సాదన్, రవీందర్, తిరుపతి, శ్రీను, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సారవంతమైన నేలతోనే అధిక దిగుబడి



భూసారాన్ని పరిశీలిస్తున్న ప్రియాంకరెడ్డి

**శాయంపేట:** పంట సాగు చేసే నేలలు సారవంతంగా ఉంటేనే అధిక దిగుబడి వస్తుందని ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్‌పీయూ మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. మండలంలోని సూరంపేటలో ప్రపంచ నేల మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నేలలు, పంట దిగుబడిపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంకరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయానికి మూలాధారమైన పంచభూతాలలో ఒకటైన నేలను కాపాడుకుంటేనే రైతుకు అధిక దిగుబడి వస్తుందన్నారు. నేలలో భూసారం పెరుగాలంటే పచ్చి రొట్టె, సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంట సాగు చేయాలని, ఎరువులను వినియోగించాలన్నారు. నేలలో ఉండే సారవంతమైన పొర కొట్టుకుపోకుండా ఉండేందుకు పొలం చుట్టూ బౌండ్‌ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లెడ్ల రజితరఘుపతి, రైతులు సాంబరెడ్డి, కార్తిక్‌రెడ్డి, రజిత, వసంత, సమ్మక్క, సంధ్య, చైత్ర, సిబ్బంది గౌస్, కల్పన, సుధా, తిరుపతి, హిమబిందు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

**దామెర:** మండలంలోని వెంకటాపూర్‌లో శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం వైభవంగా కొనసాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం యాగశాల, అంకురారోపణం, ధ్వజారోహనం కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, కోగిల్వాయి గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో దూప, దీప నైవేద్యం సమర్పించారు. కాగా నేడు ఉదయం 8.49 గంటలకు మంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ పున్నం సంపత్ తెలిపారు. కమిటీ సభ్యులు బాబురావు, అంకూస్, సదాశివుడు, కైలాష్, రాజు, రమేష్, రాజ్‌కుమార్, రవీందర్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు ప్రాణాంతకం : డాక్టర్ మంజుల



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామ్‌చందర్

**దామెర:** పొగాకు అలవాటు ప్రాణాలను హరిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల మైనారిటీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పొగాకు అలవాటు కారణంగా క్యాన్సర్ బారినపడే ప్రమాదముందన్నారు. గుట్కా, పాన్, సిగరేట్ ఇతర పొగాకు పదార్థాల అలవాటుకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడి అనారోగ్యానికి గురి కావదన్నారు. అదే విధంగా లెప్రెసీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెల్లమచ్చల బారిన పడిన విద్యార్థులను గుర్తించి వైద్య పరీక్షలు చేశారు. డీహెచ్‌ఈఓ శ్రీనివాస్, సీహెచ్‌ఓ రామచందర్, డీపీఎంఓ రవీందర్, కొమురయ్య, గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీలత, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, నరేష్, ఏఎన్‌ఎంలు సౌందర్య, భారతి, రజిత పాల్గొన్నారు.